క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: సైబర్‌సిటీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వివేక్‌నగర్, బాలాజీనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్, వివేక్‌నగర్ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దళితుల ఐక్య వేదిక నూతన కమిటీ



కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఎన్నికైన సభ్యులు

కూకట్‌పల్లి: దళితుల మధ్య ఐక్యత కోసమే దళితుల ఐక్యవేదిక ఏర్పడిందని ఎలక్షన్ కమిటీ చైర్మన్ కర్క పెంటయ్య, సభ్యుడు నపారి చంద్రశేఖర్, బోడ నర్సింగరావు, సింగూరి పాండు, ఎన్పీ లక్ష్మణ్, యాదయ్య, పుల్లారావులు పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లి వైజంక్షన్‌డా బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు డిక్లరేషన్ పత్రాలను అందించారు. ఈ కమిటీ 2025 ఆగస్టు వరకు కొనసాగుతుందని తెలిపారు.

కార్పొరేటర్‌ను కలిసిన మేరు సంఘం నాయకులు

బాలానగర్: మేరు సంఘం బాలానగర్ జోన్ కమిటీ సభ్యులు ఆదివారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ పత్రాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షుడు అన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అక్కు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, కోశాధికారి చిగురి నరేందర్, ఉపాధ్యక్షుడు నాపోలు నాగరాజు, కార్యదర్శి పోలేపల్లి లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తల్లా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమైక్య లీడర్లతో కార్పొరేటర్ సమావేశం



సమావేశంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన సమైక్య లీడర్లు, బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులతో ఆదివారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో నిర్వహించనున్న పాదయాత్ర గురించి ఈ సమావేశంలో చర్చించారు. డివిజన్‌లోని ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, గౌరవ మహిళా అధ్యక్షురాలు మధులత, లక్ష్మమ్మ, షేక్ బీబీ, స్వరూపా తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

భాగ్యనగర్‌కాలనీ: అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... వనస్థలిపురం ప్రాంతానికి చెందిన మల్లిక్ మడిశెట్టి (37) ఏడాది నుంచి రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 20న అనుమానాస్పదస్థితిలో ఇంట్లోనే మృతి చెందాడు. మల్లిక్ ఇంటికి వచ్చిన మిత్రుడు చిన్నూ ఇది గమనించి ఇంటి యజమాని సలీంకు సమాచారం అందించారు. వెంటనే అతడు అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు 'మనూ'లో నాలెడ్జ్ సిరీస్ ఎన్‌రిచ్‌మెంట్ లెక్చర్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోఈనెల 22వ తేదీన 'మనూ' 5వ నాలెడ్జ్ సిరీస్ ఎన్‌రిచ్‌మెంట్ లెక్చర్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో ఈ లెక్చర్‌ను నిర్వహిస్తామన్నారు. ఎస్ఎఫ్‌డీసీ ఫిల్మ్ ఫెసిలిటేషన్ మాజీ హెడ్ విక్రమ్‌జిత్‌రాయ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. 'జీ–20 దేశాల మధ్య చలనచిత్ర సహ– నిర్మాణ సాధ్యాసాధ్యాలు' అనే అంశంపై ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో జరిగే ఈ కార్యక్రమం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారన్నారు.

సైలెన్సర్ల మోతపై... ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం!

- 230 మంది వాహనదారులపై కేసులు
- సైలెన్సర్లు మార్చి.. అధిక శబ్దంతో దూసుకెళ్తూ...
- ఎంవీ యాక్ట్ కింద కేసులు.. జరిమానాలు

షోరూం నుంచి వచ్చిన వాహనాల సైలెన్సర్లను మార్చి అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లను బిగించుకొని రయ్... రయ్ మంటూ దూసుకుపోతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. చెవులు చిల్లులు పడేలా శబ్దంతో దూసుకుపోతూ ఇతర వాహనదారులు, పాదచారులకు న్యూసెన్స్ కలిగిస్తున్న న్యూటరిస్ట్‌లపై కొరడా ఝులిపిస్తున్నారు.



సైలెన్సర్లు మార్చి అధిక శబ్దంతో దూసుకెళ్తున్న ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ఈ నెల 10వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సైలెన్సర్లు మాడిఫై చేసి దూసుకెళ్తున్న వాహనాలను తనిఖీల్లో పట్టుకుంటూ అక్కడికక్కడే మెకానిక్‌లను పిలిపిస్తూ మాడిఫై చేసిన సైలెన్సర్లను తొలగిస్తూ షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు బిగించి అంతటితో ఊరుకోకుండా జరిమానా విధిస్తున్నారు.

◆ ఈ నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో గడచిన పది రోజులుగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సైలెన్సర్లు మార్చి ఎంవీయాక్ట్‌ను ధిక్కరించిన 230 మంది వాహనదారులపై కేసులు నమోదు చేయడమే కాకుండా జరిమానాలు విధించారు. ఎంవీ యాక్ట్ ప్రకారం సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లు వాహనం నడిపిస్తే రూ. 1000 జరిమానా విధిస్తున్నారు.

◆ జూబ్లీహిల్స్ పరిధిలోనే ఈ పది రోజుల వ్యవధిలో 67 కేసులు నమోదు చేశారు. ఈ డ్రైవ్ మరింత కాలం కొనసాగుతుందని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

రాత్రిపూటే ఎక్కువ...

సైలెన్సర్లు మార్చి రకరకాల శబ్దాలతో కొత్త రకం సైలెన్సర్లు బిగించుకొని యువకులు స్పోర్ట్స్ బైక్‌లు, కార్లపై దూసుకెళ్తున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, నెక్లెస్ రోడ్డు, ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై రాత్రిపూట ఎక్కువగా ఈ వాహనాలు దూసుకెళ్తున్నాయి. వృద్ధులు, పిల్లలు ఈ సౌండ్‌కు దద్దరిల్లిపోతున్నారు. పక్క నుంచే చెవులు చిల్లులు పడేలా దూసుకెళ్తున్న వాహనాలతో చాలా మందికి గుండె ఆగినంత పని అవుతున్నది. డయల్ 100కు ఎక్కువగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. బంజారాహిల్స్, కేబీఆర్ పార్కు నుంచి దుర్గం చెరువు వరకు దూసుకెళ్తున్న ఈ స్పోర్ట్స్ బైక్‌లు, కార్లు తిరిగి అక్కడి నుంచి కేబీఆర్ పార్కు వరకు దూసుకొస్తున్నాయి. రాత్రి 8 తర్వాత తెల్లవారుజామున 2, 3 గంటల వరకు ఈ మోత మోగుతున్నది. ఎక్కువగా బంజారాహిల్స్,



మెకానిక్ సాయంతో సైలెన్సర్లు తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్

కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు నెక్లెస్ రోడ్డులో సైలెన్సర్ల శబ్దాలు స్థానికులకు నరకప్రాయంగా మారుతున్నాయి. ఇటీవల పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఈ మోతపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి.

రోజూ తనిఖీలు...



సైలెన్సర్లు మాడిఫై చేసి వాహనాలు నడిపించడం ఎంవీ యాక్ట్ ప్రకారం నేరం. ఇలాంటి వారిపై జరిమానాలు విధించడం జరుగుతుంది. కొద్ది రోజులుగా మా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ 30 కిపైగా కేసులు నమోదవుతున్నాయి. అక్కడికక్కడే మార్చిన సైలెన్సర్లను తొలగించడం జరుగుతుంది. ఈ ప్రక్రియ రోజూ కొనసాగుతుంది. ఎవరైనా సైలెన్సర్లు మార్చుకొని అధికశబ్దంతో కూడిన సైలెన్సర్లు బిగించుకుంటే వెంటనే తొలగించుకోవాలి.ట్రాఫిక్ పోలీసులకు దొరికితే జరిమానా విధిస్తాం.

– డి.నాగేశ్వర్‌రావు, ఏసీపీ ట్రాఫిక్ వెస్ట్‌జోన్–2

మెకానిక్‌లతో సైలెన్సర్లు తొలగిస్తాం



పది రోజులుగా మాడిఫై చేసిన సైలెన్సర్లపై స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నాం. వేర్వేరుచోట్ల ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. మరికొద్ది రోజులు ఇలాగే కొనసాగుతాయి. ఎవరైనా తమ వాహనాలను అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లు బిగించుకొని ఉంటే వాటిని తొలగించుకోవడం మంచిది. లేదంటే పట్టుబడ్డప్పుడు మేమే మెకానిక్ సాయంతో వాటిని తీసివేయిస్తాం. ఇప్పటి వరకు చాలా మంది వాహనదారులకు జరిమానాలు విధించడమే కాకుండా సైలెన్సర్లు కూడా తొలగించారు. కొంత మంది కార్లకు కూడా సైలెన్సర్లు మార్చి తిరుగుతున్నట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి. అలాంటి వాటిని కూడా గుర్తించి జరిమానాలు విధించడమే కాకుండా అవసరమైతే వాహనాలను సీజ్ చేసి సైలెన్సర్లను తొలగిస్తాం.

– వినోద్‌కుమార్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఉచిత వైద్య శిబిరం



మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీహాల్ ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందారెడ్డి, కంచర్ల శ్రీనివాసరావు, జగన్నాథంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జీవిఆర్‌కేఆచార్యులుకు అరుదైన అవకాశం కలిగింది. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ ట్రేడీఏఎఫ్ఏటీ) ఆస్ట్రేలియా, ప్రొఫెసర్ జీవిఆర్‌కే ఆచార్యులుకు ఈ అవకాశం కలిగింది, ఆసియా పసిఫిక్ ఏజ్డ్ కేర్ హబ్(ఏపీఏసీహెచ్) ఫెలోషిప్ కింద ఫ్లిండర్స్ యూనివర్శిటీ నిర్వహించే ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియా ఫెలోషిప్ కింద ఆయన పసిఫిక్‌లో వృద్ధుల సంరక్షణ కోసం కెపాసిటీ బిల్డింగ్ నెట్‌వర్క్‌ల ప్రభావం, నాయకత్వం ' అనే అంశంపై ఫెలోషిప్ ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది. ఈ ఫెలోషిప్ కింది ప్రొఫెసర్ ఆచార్యులుతోపాటు ఫ్లైండర్స్ యూనివర్శిటీ, అడిలైడ్, కాన్‌బెర్రా, సిడ్నీలను ఆయన సందర్శిస్తారు. ఈ ఫెలోషిప్‌లో ఆరు దేశాల నుంచి 15 మంది సభ్యులు పాల్గొంటారు. భారతదేశం, నేపాల్, బంగ్లాదేశ్, మలేషియా, ఇండోనేషియా ఫిలిప్పీన్స్ ఆరోగ్యవ వ్యవస్థలను బలోపేతం చేయడంలో వారు అత్యుత్తమ ట్రాక్ రికార్డ్ ఆధారంగా సభ్యులుగా నా మినేట్ చేయడ్డారు, అలాగే వారి స్వదేశాలలో వృద్ధుల సంరక్షణ వ్యవస్థలను మెరుగుపర్చడంలో వారు ప్రదర్శించిన నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పరిధిలోని పాపారాయుడు నగర్ కాలనీలో నాయన్స్ అపార్టుమెంట్ వారు సుమారు 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్ పాల్గొని కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎటువంటి నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతి బస్తీ, కాలనీలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాలు జరిగినప్పుడు నేరస్తులను పట్టుకునే సందర్భంలో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌రావు, శ్రీనివాస, భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పాపారాయుడు నగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్, ఇన్‌స్పెక్టర్

సోషల్ మీడియాపై అందేరి ఎమ్మెల్యే అవగాహన



బీజేపీ కార్యాలయంలో జరిగిన సోషల్ మీడియా సమావేశంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సోషల్ మీడియా, వాల్ పెయింటింగ్‌పై ఆదివారం జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహారాష్ట్ర అందేరి ఎమ్మెల్యే అమిత్ భాస్కర్ పాల్గొని సోషల్ మీడియాలో చేపట్టే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 'రెండోసారి మోదీ సర్కార్... తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం' అనే నినాదంతో వాల్‌పెయింట్ వేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్చనపల్లి సూర్యరావు, నాయినేని సూర్యప్రకాష్‌రావు, కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, సోషల్ మీడియా కన్వీనర్లు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేపాలీలకు అండగా ఉంటాం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చి స్థానికంగా నివాసిస్తున్న వారికి తమ సహాయ సహకారాలు అందిస్తామని ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తెలిపారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో నివాసం ఉంటున్న నేపాల్‌కు చెందిన కుటుంబాలు కార్పొరేటర్‌ను ఆయన నివాసంలో కలిసి వారి సమస్యలను వివరించారు. తమకు ఓటు హక్కుతో పాటు ఆరోగ్య శ్రీ కార్డులు, రేషన్‌కార్డులు అందించాలని కోరారు.

◆ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. నేపాలీలు వినతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఓటు హక్కు కల్పించేలా కృషి చేస్తానన్నారు. ఏ సమస్య తలెత్తిన తన దృష్టికి తేవాలని తక్షణమే సమస్యను పరిస్కారిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరుపున వచ్చే పథకాలలో అవకాశం కల్పించి లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. కర్రె జంగయ్య, వార్డు మెంబర్ బాబన్న, మల్లేష్‌యాదవ్, పశుపతిరాజు, కృష్ణ, కళావతి పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు సమస్యలు తెలుపుతున్న నేపాలీలు

బీజేపీలో చేరికలు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ నుంచి మహిళలు అధిక సంఖ్యలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ సమక్షంలో ఆదివారం బీజేపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారత వారిని అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపర్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో అనూష, లక్ష్మి, దుర్గమ్మ, కాంతమ్మ, నవనీత, మౌనిక, పద్మ, పార్వతీ, రమా, విజయ, దివ్య, రాధా, లక్ష్మీ, రమాదేవి, దేవేంద్ర తదితరులు ఉన్నారు.



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరిన మహిళలు

శాంతియుత ర్యాలీ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలో ఆదివారం అల్లాపూర్ డివిజన్ క్రిస్టియన్ మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను వ్యతిరేకిస్తూ ర్యాలీలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, స్వామి, దేవదానం, జాషువా, జైపాల్, పాస్టర్లు, క్రైస్తవ సోదర సోదరీమణులు, చిన్నారులు పెద్ద ఎత్తులన పాల్గొన్నారు.

యూత్ ఇంటరాక్షన్ విత్ జీవీఆర్



యువకులతో మాట్లాడుతున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వైష్ణవి గ్రాండ్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు యూత్ ఇంటరాక్షన్ విత్ జీవీఆర్ అనే కార్యక్రమం ఆదివారం నిర్వహిచారు. రాజకీయాల్లో యువకుల పాత్ర, వచ్చే ఎన్నికల్లో యువత ఎలా వ్యవహరించాలని అనే విషయాలపై చర్చ జరిగింది. ఈసారి ఎన్నికల్లో గొట్టిముక్కల వెంకటేశ్వరరావుకే యువకుల మద్దతు ఉంటుందని యువకులు అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రజల్లోనే ఉన్నానని ఎన్నికల బరిలో కూడా ఉంటానని స్పష్టం చేశారు.

వివాదంతో నిలిచిన రోడ్డు పనులు



భవానీ నగర్ రైల్వే ట్రాక్ పక్కన ఆగిన రోడ్డు నిర్మాణం పనులు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భవానీనగర్ రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రోడ్డు నిర్మాణ పనులు గతవారం రోజులుగా నిలిపివేశారు. స్థానికంగా వివాదం కావడంతో పనులు నిలిపివేశామని.. వివాదం ముగిసిన తరువాత రోడ్డు నిర్మాణం చేస్తామని అధికారులు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఆ ప్రాంతానికి రోడ్డు నిర్మాణం జరగలేదు. రోడ్డు లేకపోవడంతో స్థానికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో స్థానికుల వివాదం ఆగిపోయింది.

◆ 18 ఫీట్ల రోడ్డు మంజూరు కావడంతో పనులు ప్రారంభించిన అధికారులకు ఒక షెడ్డు నిర్మాణం, ఒక భవన ప్రహరీ ముందుకు రావడంతో పనులు ఆగిపోయాయి. వాటిని వెనక్కి జరపాలని కోరడంతో వారు తీసుకోకపోవడంతో పనులు ఆగిపోయాయి. రోడ్డు వెడల్పుగా ఉంటే బాగుంటుందన్నారు. ఇద్దరి వల్ల పనులు ఆగిపోవడం బాధాకరంగా ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.



చిత్తారమ్మకు బోనాలు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్ చిత్తారమ్మ తల్లి బోనాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సీఐ సురేందర్, ఎస్సై ప్రేమ్‌సాగర్, సీనియర్ నాయకులు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్, యాదయ్య, సంతోష్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి వినాయక భక్త బృందం కమిటీ నియామకం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి శ్రీ వినాయక భక్త బృందం చైర్మన్ నాయినేని సూర్యప్రకాష్‌రావు అధ్యక్షతన ఆయన నివాసంలో కమిటీ సభ్యులు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విఘ్నేశ్వరుడిని నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. దానికి తగిన ఏర్పాటు చేసుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భక్తిభావంతో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించటంపై కమిటీ సభ్యులు చర్చించారు. అనంతరం 2023 నూతన కమిటీ సలహాదారులుగా జలవేంధర్‌రావు, ఎస్. పద్మారావు, సమన్వయకర్త ఏ. సూర్యారావు, అధ్యక్షులు చౌదరి నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు జి. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి. పాపారావు, కోశాధికారి సిహెచ్. సూర్యారావు, కార్యదర్శి ఎం. తిరుపతిరావు, సభ్యులు డి. వెంకట్రావు, ఏ. జనార్దన్‌రావు, డి.దేశాలలను నూతన కమిటీలో నియమించారు.

లేక్‌వ్యూ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని లేక్‌వ్యూ కాలనీలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం కాలనీవాసులతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నానని అన్నారు. కాలనీవాసులందరూ కాలనీ అభివృద్ధిలో భాగస్వాములై సమష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సురేష్, వెంకటేశ్వర్‌రావు, శరత్, యుగేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి



కేపీహెచ్‌బీ రాజీవ్ గాంధీ సర్కిల్‌లో నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ... టెలి కమ్యూనికేషన్స్ విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడని కొనియాడారు. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి, ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. అదే విధంగా సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలను సమకూర్చాలని ఎంతో తపన పడ్డారన్నారు. మనదేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఆయన చేసిన ప్రయత్నాన్ని మేధావులు సైతం ప్రశంసించారని కొనియాడారు. దేశ రాజకీయాల్లోకి యువ శక్తి వచ్చిందంటే అందుకు ప్రధాన కారణం రాజీవ్‌గాంధీ అని అన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు.



ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌లో..



బాలానగర్‌లో..